క్లుప్తంగా

3న అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు

గన్నవరం: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి మే 3వ తేదీన అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ పి. శివాజీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. బస్సు ఆ రోజు రాత్రి 7 గంటలకు బయలుదేరి 4వ తేదీ ఉదయం శ్రీకాళహస్తి దర్శనం, మధ్యాహ్నం కాణిపాకంలో విఘ్నేశ్వరస్వామి దర్శనం, భోజనం, సాయంత్రం శ్రీపురం గోల్డెన్ టెంపుల్‌కు చేరుకుంటుందని పేర్కొన్నారు. అదే రోజు రాత్రి అరుణాచలానికి చేరుకుని 5వ తేదీ పౌర్ణమి రోజు ఉదయం గిరి ప్రదక్షిణలు, స్వామివారి దర్శనం అనంతరం బస్సు తిరిగి బయలుదేరి 6వ తేదీ ఉదయం 8 గంటలకు గన్నవరం చేరుకుంటుందని వివరించారు. ఈ యాత్రకు పుష్‌బ్యాక్ సీటింగ్ ఉన్న సూపర్ లగ్జరీ బస్సును కేటాయించినట్లు, టిక్కెట్ ధరను రూ. 2,700 నిర్ణయించినట్లు తెలిపారు. ఈ బస్ సర్వీస్ కోసం 9790996090, 7382905633 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జెడ్పీ సీఈఓకు సత్కారం



గన్నవరం రూరల్: మండలంలోని సూరంపల్లి గ్రామానికి బుధవారం వచ్చిన జెడ్పీ సీఈఓ జ్యోతిబసును సర్పంచ్ పులపాక బాబూరావు, కార్యదర్శి కోట సురేష్‌బాబు సత్కరించారు. తొలిసారిగా గ్రామానికి విచ్చేసిన ఆయనకు శాలువా కప్పారు. ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, ఏపీఓ సత్యప్రియ పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్‌పై కేసు

పెనమలూరు: నిర్లక్ష్యంగా ఆటో నడిపి రోడ్డు ప్రమాదానికి కారకుడైన ఆటోడ్రైవర్‌పై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుడివాడకు చెందిన వడ్డీ వెంకటసత్యనారాయణ తన కారులో విజయవాడకు వచ్చి పని ముగించుకుని తిరిగి గుడివాడకు బయలుదేరాడు. అతను ప్రయాణిస్తున్న కారు గంగూరు సెంటర్ వద్దకు రాగా ఎదురుగా వచ్చిన ఆటో కారును ఢీ కొట్టింది. ఘటనలో కారు ధ్వంసమైంది. కారు యజమాని సత్యనారాయణ ఫిర్యాదుతో ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

పోలీస్ శిక్షణార్థ అభ్యర్థుల కోసం పిట్



గన్నవరం: స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో పోలీసు ఉద్యోగ నియామకాలకు ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ నిమిత్తం దాతల సాయంతో పిట్ అందుబాటులోకి వచ్చింది. గన్నవరానికి చెందిన పెద్దు శ్రీకాంత్ అందజేసిన రూ. 20 వేల ఆర్థిక సాయంతో 13 మీటర్ల పొడవు, మూడు మీటర్ల వెడల్పు, అడుగున్నర లోతున పిట్‌ను ఏర్పాటు చేశారు. దీనిలో సుమారు 30 టన్నుల ఇసుకను పోసి పిట్ సిద్ధం చేశారు. పోలీస్ ఫిజికల్ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల శిక్షణకు సాయం చేసిన శ్రీకాంత్‌ను బుధవారం వాకర్స్ అసోసియేషన సభ్యులు సత్కరించారు. ఈ ప్రాంతవాసులు వినియోగించుకోవాలని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బాలకృష్ణమూర్తి తెలిపారు.

సచివాలయాలు ఉన్నత సేవలందించాలి

పెనమలూరు: సచివాలయాల సిబ్బంది ప్రజలకు ఉన్నత సేవలందించడంపై దృష్టి సారించాలని డీఎల్‌డీఓ ఎన్వీ నాంచారావు అన్నారు. ఆయన బుధవారం గంగూరులో సచివాలయం 1, 2 సందర్శించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. గ్రామ సచివాలయాలు సేవలు అందించే విషయంలో ఎప్పుడూ ముందజలో ఉండాలని తెలిపారు. పెనమలూరు మండల పరిధిలో సచివాలయాలకే రాష్ట్ర స్థాయిలో గుర్తింపు వచ్చిందన్నారు. ప్రధానంగా వణుకూరు సచివాలయాన్ని దేశ, విదేశీ బృందాలు సందర్శించాయన్నారు. మండల పరిధిలో మిగిలిన సచివాలయాల సేవలు కూడా ఉన్నత ప్రమాణాలతో ఉండి గుర్తింపు పొందాలన్నారు. దీనికి సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ఈఓపీఆర్డీ కోరా శ్రీనివారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిమాపక పరికరాల వినియోగంపై అవగాహన

హనుమాన్‌జంక్షన్ రూరల్: అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా నియంత్రించడానికి అపార్టుమెంట్లు, ఆస్పత్రులు, పెట్రోల్ బంకు, వాణిజ్య కేంద్రాల్లో తప్పకుండా అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచాలని హనుమాన్‌జంక్షన్ ఫైర్ ఆఫీసర్ జీఆర్ మోహనరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలు పురస్కరించుకుని విజయవాడ రోడ్డులోని సీతామహాలక్ష్మి నర్సింగ్ హోం, నయారా పెట్రోల్ బంక్‌లో వినియోగదారులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించి, కరపత్రాలు పంపిణీ చేశారు. బంకుల్లో అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అగ్నిమాపక పరికరాలు వినియోగించడాన్ని తెలిపారు.

నవరత్నాల పాలన బాగుంది

గడప గడపలో ప్రజల వెల్లడి



పోరంకిలో 'గడప గడప'లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: రాష్ట్రంలో నవరత్నాల పాలన బాగుందని, జగనన్న ఇచ్చిన హామీలు అమలు చేశారని లబ్ధిదారులు వి. వెంకటరమణ, వీరాంజనేయులు హర్షం వ్యక్తం చేశారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా బుధవారం పోరంకి గ్రామంలో లబ్ధిదారులను కలిసి ప్రభుత్వ పథకాలు అమలు చేసిన బుక్‌లెట్ అందజేసి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను జగనన్న అమలు చేశారని కొనియాడారు. నవరత్నాలతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయని తెలిపారు.

హామీలు అమలు చేశాం

ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను అమలు చేశామని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. గతంలో చంద్రబాబునాయుడు అనేక హామీలను ప్రజలకు ఇచ్చి అధికారం చేపట్టిన తర్వాత దగా చేశాడని ఆరోపించారు. జగన్న పాదయాత్ర, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీకి కట్టుబడి సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు చేశారని తెలిపారు. ప్రజలు కూడా వాస్తవాలు గ్రహించి సీఎం జగనన్నకు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎన్.ప్రకాశరావు, టిడ్కో డైరెక్టర్ పి.రాఘవరావు, మార్కెట్ యార్డు చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, వైఎస్సార్ సీపీ నేతలు నల్లమోతు జీవన్, అంకెం రాజేష్, అద్దేపల్లి చందు, ఉప్పాల వీరబాబు, బందెల రాజు, బుర్ల వేణు , చలమల జోజి, వెంకటేశ్వరరావు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా జగన్‌పై నమ్మకం

హనుమాన్‌జంక్షన్ రూరల్: వైఎస్సార్ సీపీ పాలనలో కుల, మత, రాజకీయ వివక్ష లేకుండా అర్హులకు సంక్షేమ పథకాలు అందించడంతో ప్రతి ఇంటా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై అపార నమ్మకం, విశ్వాసం కనపరుస్తున్నారని ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ అన్నారు. హనుమాన్ జంక్షన్‌లోని 7వ వార్డులో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులతో పాటుగా సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి వార్డులోని ఇంటింటికీ వెళ్లి నేరుగా ప్రజలను కలిశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు నాయుడి పాలనకు, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనకు తేడాను ప్రజలకు సవివరంగా తెలియజేశారు. ప్రజల అనుమతితో ఇళ్లకు జగనన్నే మా నమ్మకం స్టిక్కర్లను అంటించారు. జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, సర్పంచ్ సరిపల్లి కమలాభాయి, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమరవల్లి కిరణ్ మూర్తి, వార్డు సభ్యురాలు చందు కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.



హనుమాన్‌జంక్షన్‌లో స్టిక్కర్లు ప్రదర్శిస్తున్న ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ గాంధీ, ఇతర నేతలు



గన్నవరంలో స్టికర్ అంటిస్తున్న జెడ్పీటీసీ, పార్టీ నేతలు

గన్నవరం: అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఏఎంసీ చైర్‌పర్సన్ రామిశెట్టి అంజనీకుమారి పేర్కొన్నారు. మండలంలోని కేసరపల్లి శివారు లెప్రసీకాలనీలో బుధవారం జరిగిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్‌రాణి, వైస్ ఎంపీపీ కాలగడ్డ శివనాగరాజకుమారి, సర్పంచి చేబ్రోలు లక్ష్మీమౌనికతో కలిసి పాల్గొన్నారు. గన్నవరంలో సచివాలయం-4 పరిధిలో జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు తిరివీధి రవి, సచివాలయ కన్వీనర్లు నానిబాబు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. వీఎస్.పురం కాలనీలో నేతలు పాల్గొన్నారు.

రామవరప్పాడు: గొల్లపూడి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు ఆధ్వర్యంలో రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు గ్రామాల్లో మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్లు అంటిస్తున్నారు. ఎనికేపాడు 10వ వార్డులో జెండా చెట్టు పరిధిలో ఎంపీటీసీ రాచమళ్ల రత్నకుమారి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అంటించారు.

యనమలకుదురులో వంతెనకు గ్రీన్ సిగ్నల్

- నిధులు సమకూర్చనున్న మున్సిపాలిటీ
- నీటిపారుదల శాఖ పర్యవేక్షణలో నిర్మాణం

పెనమలూరు: యనమలకుదురులో వంతెన నిర్మాణానికి ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ నిధులతో నిర్మించనున్నారు. అధికారుల బృందం పర్యటించి వంతెన నిర్మాణం చేయాల్సిన ప్రాంతాన్ని ఎంపిక చేస్తారు. యనమలకుదురు గ్రామంలో దాదాపు 60 వేల మంది జనాభా ఉన్నారు. గ్రామస్తులు విజయవాడ పరిసర ప్రాంతాలకు వెళ్లాలంటే యనమలకుదురు లాకుల మీద ప్రయాణించాలి. ఈ లాకులను బ్రిటీష్ కాలంలో నిర్మించారు. ఇది శిథిలావస్థకు చేరుకుంది. అంతేకాకుండా నేడు జనాభా పెరగడం.. లాకుల వంతెన చాలకపోవడంతో ఇక్కడ తరచూ ట్రాఫిక్ నిలుస్తోంది. గ్రామస్తుల సమస్య పరిష్కరించడానికి ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి చొరవ చూపారు. ఇక్కడ నూతన వంతెన నిర్మించాలని నిర్ణయించారు. ఈ మేరకు తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్.. నీటిపారుదల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ అనుమతులు కోరారు. ఈ అంశాన్ని సీఈ.. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఏపీ వాటర్ రిసోర్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ వంతెన నిర్మాణానికి అనుమతిస్తూ ఇటీవల ఉత్తర్వులు ఇచ్చారు.



యనమలకుదురు లాకులు

కేఈబీ కెనాల్‌పై వంతెన నిర్మాణం

యనమలకుదురులో డొంక రోడ్డు, పెదపులిపాక ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు లాకులపై ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. ఇప్పటికే బందరు కాల్వపై వంతెన నిర్మాణ దశలో ఉండటంతో.. రెండో వంతెనను కేఈబీ కెనాల్‌పై రూ.5 కోట్లతో నిర్మించనున్నారు. వంతెన నిర్మాణానికి మున్సిపాలిటీ ముందుకు రావడంతో మున్సిపాలిటి నిధులతో పాటు, ఎంపీ, ఎమ్మెల్యే నిధులు కేటాయించనున్నారు. వంతెన నిర్మాణ ప్రాంతం, వంతెన డిజైన్, నిర్మాణం పనులు పూర్తిగా నీటిపారుదల శాఖ పర్యవేక్షణలో జరుగుతాయి. త్వరలో డిజైన్ పూర్తి చేసి వంతెన నిర్మాణానికి వేసవిలో శ్రీకారం చుట్టనున్నారు. ఇది పూర్తయితే లాకులతో పని లేకుండా బందరు కాల్వపై ఉన్న వంతెనకు అనుసంధానమై గ్రామస్తులు ప్రయాణం చేయవచ్చు.

అసంపూర్తిగా ఉన్న వంతెన నిర్మాణంలో కదలిక

యనమలకుదురులో బందరు కాల్వపై అసంపూర్తిగా ఉన్న వంతెన నిర్మాణంలో కదలిక వచ్చింది. గత టీడీపీ పాలనలో.. ఆ వంతెన నిర్మాణం పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌కు బిల్లులు ఇవ్వలేదు. కాంట్రాక్టర్ కోర్టుకు వెళ్లడంతో వంతెన పనులు ఆగిపోయాయి. కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లించాలని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి, వంతెన అభివృద్ధి కమిటీ విడివిడిగా నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబును కలిసి సమస్య తెలిపారు. దీంతో వంతెన బిల్లు చెల్లింపులో కదలిక వచ్చినట్లు నీటిపారుదల శాఖ అధికారులు స్పష్టం చేశారు.

త్వరలో డిజైన్లు

యనమలకుదురు కేఈబీ కెనాల్‌పై వంతెన నిర్మాణానికి నీటిపారుదల శాఖతో డిజైన్‌లు సిద్ధం చేస్తాం. వంతెన నిర్మాణ స్థలం ఎంపిక చేస్తాం. వేగంగా పనులు పూర్తి చేసి గ్రామస్తుల సమస్య పరిష్కరిస్తాం.

– ఎస్.ప్రకాశరావు, కమిషనర్, తాడిగడప మున్సిపాలిటీ

ఆర్థిక సాయం అందించిన విద్యార్థులు

పెనమలూరు: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న విద్యార్థికి సహ విద్యార్థులు బుధవారం ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు. కానూరు వీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో చదివిన వి.గోపీచంద్ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. అతనికి తండ్రి కిడ్నీ ఇవ్వటంతో ఆపరేషన్ చేశారు. కాలేజీ ఎస్ఎస్ఎస్ విద్యార్థులు సహ విద్యార్థి కోలుకోవాలని, ఆయనకు అండగా నిలిచి మందుల కోసం రూ. 51 వేలు ఆర్థిక సాయం అందించారు. గోపీచంద్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు సొమ్ము అందజేశారు. విద్యార్థులు సాయం అందించటంపై కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు అభినందించారు.



విద్యార్థుల్లో నైపుణ్యాలు వెలికితీయాలి

గుడివాడ టౌన్: ప్రతి విద్యార్థి లోనూ అనేక నైపుణ్యాలు దాగి ఉంటాయని, వాటిని వెలికి తీసి వారి అభ్యున్నతికి కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ అన్నారు. స్థానిక ఏకేటీపీ మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో బుధవారం హైదరాబాద్‌కు చెందిన మెగా లెజెండ్స్ సోషల్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. మెగా లెజెండ్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ఫ్యాషన్ డిజైనింగ్ రోజు రోజుకూ అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఈ బాలికల పాఠశాలలో అత్యుత్తమ శిక్షణ ఇస్తూ వారిని ప్రోత్సహించాలన్నారు. ఆర్గనైజేషన్ అధ్యక్షుడు ఎస్.భీమేశ్వరరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆర్.మంగతాయారు, కోశాధికారి ఆర్‌డీ ప్రసాదు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వేల్పూరులో గొలుసు దొంగతనం

కంకిపాడు: వేల్పూరులో గొలుసు దొంగతనం కలకలం రేపింది. ఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. ఎస్‌ఐ కె.సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వేల్పూరు గ్రామానికి చెందిన కొఠారి వెంకటలక్ష్మి ఇంటి బయట కూర్చుని ఉన్నారు. ఆ సమయంలో ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనంపై వచ్చి మంచినీరు కావాలని అడిగారు. ఆమె ఇవ్వకుండా బయటే కూర్చున్నారు. అక్కడి నుంచి వెళ్లిపోయినట్టే వెళ్లి తిరిగి వచ్చిన ఆ ముగ్గురు వ్యక్తులు ఆరుబయట కూర్చుని ఉన్న ఆమె మెడలోని నానుతాడును తెంచుకుని పరారయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితురాలు వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా హజరత్ సయ్యద్ గాలీబ్ షహీద్ ఉరుసు

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురంలోని హజరత్ సయ్యద్ గాలీబ్ షహీద్ (ర.అలై) అవులియావారి 435వ ఉరుసు గంధం మహోత్సవ ఊరేగింపు ఘనంగా జరిగింది. ముజావర్ షేక్ అబ్దుల్ రవూఫ్ ఇంటి వద్ద నుంచి బయలుదేరిన గంధం ఊరేగింపు భవానీపురం పురవీధుల్లో మేళతాళాలు, ఫకీర్ల భక్తి గీతాల నడుమ కోలాహలంగా సాగింది. ఊరేగింపు తిరిగి బుధవారం మధ్యాహ్నం 11.30 గంటలకు దర్గా వద్దకు చేరుకోగా దర్గా ముజావర్స్ కమిటీ ఆధ్వర్యంలో రాత్రి 7 గంటలకు దర్గా వద్ద దీపారాధన, అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ సందర్భంగా పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు దర్గాలోని బాబా సమాధిని దర్శించుకుని గంధంతో కూడిన ఛాదర్‌ను సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు శతాబ్దాలకుపైగా చరిత్ర ఉన్న భవానీపురం దర్గా ఉరుసు మహోత్సవంలో కులమతాలకు అతీతంగా రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల నుంచి వేలాది మంది పాల్గొని బాబా సమాధిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. తానుకూడా ఏటా బాబా సమాధిపై చాదర్ కప్పి పుష్పాంజలి ఘటిస్తున్నానని చెప్పారు. దర్గా ముజావర్స్ కమిటీ సభ్యులు, ముస్లిం మైనార్టీలను ఆప్యాయంగా పలకరించారు.

విద్యార్థులు లక్ష్యం నిర్దేశించుకోవాలి



పెనమలూరు: విద్యార్థులు లక్ష్యం నిర్దేశించుకుని శ్రమించాలని.. మనస్తత్వవేత్త శ్రీపతి జగదీష్ అన్నారు. కానూరు వెలగపూడి దుర్గాంబ సిద్ధార్థ న్యాయ కళాశాల, రాష్ట్ర ప్రభుత్వ డిపార్టుమెంట్ ఆఫ్ యూత్ సర్వీసెస్ ఆధ్వర్యంలో కాలేజీలో బుధవారం వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌పై సదస్సు నిర్వహించారు. జగదీష్ మాట్లాడుతూ మానసిక ఆరోగ్యం వ్యక్తిత్వ వికాసానికి చాలా అవసరమన్నారు. డాక్టర్ తేజోపతి మాట్లాడుతూ నిరంతర శ్రమతో లక్ష్యసాధన సాధ్యమవుతుందన్నారు. సదస్సులో యూత్ సర్వీసెస్ అసిస్టెంట్ మేనేజర్ ఎన్.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ సీహెచ్ దివాకర్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విలువలను కాపాడాలి

పామర్రు: ప్రతి ఒక్కరూ మానవత విలువలు కాపాడాలని పామర్రు ఎస్‌ఐ పీవీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. పామర్రు మానవత సేవ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక బందరు రోడ్డులోని వాసవీ వృద్ధ శరణాలయంలో బుధవారం వృద్ధులకు అన్నదానం నిర్వహించారు.

గ్రామాభివృద్ధికి ఆదాయం పెంచుకోవాలి

అల్లాపురం(గన్నవరం): గ్రామాభివృద్ధికి అవసరమైన ఆదాయ వనరులు పెంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి ఎన్వీ నాగేశ్వరనాయక్ సూచించారు. మండలంలోని అల్లాపురంలో ఉన్న ఘన వ్యర్థాల నుంచి సంపద తయారీ కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ కేంద్రంలో వర్మికంపోస్టు ఎరువుల తయారీ విధానం, వివిధ రకాల పండ్లు, పూల మొక్కల పెంపకంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీపీ అనగాని రవి, సర్పంచి డొక్కు సాంబశివవెంకన్నబాబుతో కలిసి డీపీఓ.. అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. మైనర్ పంచాయతీ అయినా అభివృద్ధికి అవసరమైన ఆదాయ వనరులను సమకూర్చుకోవడం ఆదర్శనీయమన్నారు. ఇంటి, నీటి పన్నులతో పాటు వెంచర్లలోని ఖాళీ ప్లాట్లకు ట్యాక్స్, వర్మికంపోస్టు ఎరువులు విక్రయం ద్వారా ఆదాయం గణనీయంగా పెంచుకోవడం స్ఫూర్తిదాయకమన్నారు. గ్రామాభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణ, జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్వహణలో గుడివాడ డివిజన్‌లోనే అల్లాపురం మోడల్‌గా నిలిచిందన్నారు. ఈ దిశగా గ్రామాన్ని ముందుకు నడిపిస్తున్న ఎంపీపీ, సర్పంచితో పాటు పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావును అభినందించారు. అనంతరం సుందరీకరించిన హిందూ శ్మశానవాటికను డీపీఓ పరిశీలించారు. డీఎల్‌పీఓ సంపత్‌కుమారి, డీపీఆర్‌సీ నవరత్నం, ఎంపీడీవో కె. వెంకటేశ్వరరావు, ఉపసర్పంచి ఆవుటపల్లి శివప్రసాద్, ఎఫ్‌టీసీ కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీపీ, సర్పంచి, ఈఓతో చర్చిస్తున్న డీపీఓ

కాలేయాన్ని కాపాడుకోవాలి

పెనమలూరు: ఆరోగ్యకరమైన అలవాట్లతో కాలేయాన్ని కాపాడుకోవాలని కామినేని ఆస్పత్రి గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ వంశీచైతన్య గూడే, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు ఎస్వీ పవన్ ఈశ్వర్ వేలినేని అన్నారు. ప్రపంచ కాలేయ దినోత్సవం సందర్భంగా పోరంకి కామినేని ఆస్పత్రిలో సదస్సు నిర్వహించారు. వైద్యులు మాట్లాడుతూ మానవ శరీరంలో మెదడు తర్వాత కాలేయమే అతి పెద్ద అవయవమన్నారు.

మనం తీసుకునే ఆహారంతో పాటు వేసుకునే మందులు కూడా కాలేయం పై ప్రభావం చూపుతాయన్నారు. మద్యం సేవిస్తే కాలేయంతో పాటు క్యాన్సర్, గుండె వ్యాధులు వస్తాయన్నారు. మితిమీరిన మద్యం తీసుకుంటే ఫాటీలివర్, హెపటైటిస్, లివర్ సిరోసిస్ వంటి వ్యాధులు వస్తాయన్నారు. పమినేని ఆస్పత్రి సీఓఓ డాక్టర్ వి.నవీన్‌కుమార్ మాట్లాడుతూ కామినేని ఆస్పత్రిలో కాలేయ మార్పిడి ఆపరేషన్‌లు కొత్త ఒరవడి ప్రవేశపెట్టిందన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న కామినేని వైద్యులు

భూసార పరీక్షల ఆధారంగా పంటలు

కంకిపాడు: భూసార పరీక్షల ఫలితాల ఆధారంగానే భూ యాజమాన్య చర్యలు చేపట్టాలని ఉయ్యూరు చెరకు పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ డి.సుధారాణి సూచించారు. ఉప్పలూరు ఆర్‌బీకే పరిధిలో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం భూసార పరీక్షలు, పచ్చిరొట్ట పైర్లు, యాజమాన్య చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ భూసార పరీక్షలు తప్పకుండా చేయించాలన్నారు. మే నెలలో పొలాల్లో ఎలుకల సమస్యను గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. భూసారాన్ని పెంపొందించే పచ్చిరొట్ట పైర్లను సాగు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం నుంచి జ్యోతిర్మయి, ఏఓ పద్మజ, రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ శ్రీనివాస్, ఏఓ పీఎం కిరణ్, సర్పంచ్ లాం సోనియా పాల్గొన్నారు.



ఉప్పలూరు పరిధిలోని చెరకు తోటల్లో సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ డి.సుధారాణి

ప్రజల దాహార్తి తీర్చడానికే..

గన్నవరం: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని గన్నవరం సీఐ పి. కనకరావు పిలుపునిచ్చారు. మండలంలోని బుద్ధవరం గ్రామంలో ముక్కామల వెంకట్రావు, విజయలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం వారి మనవడు ఫణిఅభినయ్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచి బడుగు బాలమ్మ, గ్రామ పెద్దలు రామయ్య, భవానీప్రసాద్, ఆంజనేయులు, లక్ష్మి, రవి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని తిరుపతమ్మ దేవస్థానం సెంటర్‌లో మమతల పందిరి ఫేస్‌బుక్ గ్రూప్ ఆధ్వర్యాన బుధవారం ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ప్రారంభించారు. దీని నిర్వహణకు ఆర్థికసాయం అందిస్తున్న గ్రూపు సభ్యులు కృష్ణ సరోజం (చెన్నై), కేసినపల్లి రామారావు (వరంగల్), కామేపల్లి రాణి (హైదరాబాద్)కి ఫేస్‌బుక్ గ్రూప్ అడ్మిన్ లంక రమేష్ కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ పిల్లా అనిత, ఎంపీటీసీ సభ్యుడు అమృతపల్లి సూర్యనారాయణ, గుండపనేని ఉమావరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ప్రయాణికులకు మజ్జిగ అందిస్తున్న గ్రూపు సభ్యులు, ప్రజాప్రతినిధులు

'వాసవి' మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



పెనమలూరు: పోరంకి వాసవి క్లబ్ నవ నిర్మాణ్ కపుల్స్ ఆధ్వర్యాన బుధవారం మజ్జిగ పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు వెంకట మస్తానయ్య మాట్లాడుతూ వేసవి దృష్ట్యా తమ క్లబ్.. బాటసారులకు మజ్జిగ, సుగంధ వాటర్ పంపిణీ చేసిందన్నారు. 100 రోజులు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ ఆర్‌సీ వీఎస్ సూకల సాంబశివరావు, రీజినల్ కార్యదర్శి గోపి, ట్రెజరర్ శైలజ, సభ్యులు జయశ్రీ, కొలిపర్తి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

27న పెదమద్దాలి దేవాలయ భూముల కౌలు వేలం

పామర్రు: దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెదమద్దాలి గ్రామంలోని దేవాలయ భూములకు ఈనెల 27 వ తేదీన కౌలు వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారి కె.వెంకటరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.